## నేడు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**జగద్గిరిగుట్ట :** డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ.67 లక్షల వ్యయంతో శుక్రవారం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్ పాల్గొననున్నారు. దేవమ్మ బస్తీలో రూ.17 లక్షలతో, సంజయ్‌పురీ కాలనీలో రూ.30 లక్షలతో, షిరిడీ హిల్స్ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

**జగద్గిరిగుట్ట:** రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని శివనగర్ లో రూ.60 లక్షల నిధులతో కొనసాగుతున్న రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నాగరాజు, విఠల్, ఆజం, భాస్కర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, అజర్, ధర్మారావు, రాజు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి


మాట్లాడుతున్న మోటివేటర్ కల్యాణ్

**కుత్బుల్లాపూర్:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ప్రముఖ మోటివేటర్ కల్యాణ్ అన్నారు. గురువారం వేంకటేశ్వర నగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల మనస్సును నొప్పించకూడదని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికావద్దన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారికి తగిన సమయం కేటాయించి మాట్లాడాలన్నారు. నేడు సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందని, తల్లిదండ్రులు పిల్లలు వినియోగిస్తున్న ఫోన్‌లను నిత్యం గమనించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశం, నేతాజీ హై స్కూల్ హెచ్ఎం చింతల మహేష్, అకాడమిక్ డైరెక్టర్ చింతల మానస, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కిటికీ తొలగించి ఇంట్లో చోరీ

**జీడిమెట్ల:** ఇంటి కిటికీ తొలగించి రూ.15 వేల నగదు, 19 తులాల బంగారు నగలు, 500 గ్రాముల వెండి వస్తువులను దొంగలు అపహరించారు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ కనకయ్య వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీకి చెందిన పింటు హుదేత్ బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యం నిమిత్తం కలకత్తాకు వెళ్లాడు. గురువారం ఉదయం శేరిలింగంపల్లిలో ఉండే తన బావ రతన్‌చంద్రా మండల్‌కు ఫోన్ చేసి అపురూప కాలనీలోని ఇంటికి వెళ్లి చూడాల్సిందిగా కోరాడు. అతను వెంటనే ఇంటికి వెళ్లి చూడగా.. కిటికీ తొలగించి ఉంది. తలుపులు తెరచి లోపలికి వెళ్లగా బీరువా తెరచి ఉంది. బీరువాలో ఉన్న రూ.15 వేల నగదు, 19 తులాల నగలు, 500 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో బాధితుడి బావ గురువారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడినట్లు పోలీసులు గుర్తించారు.

## అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్:** అప్పుల బాధ తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన శివరాత్రి దేవి(35), నాగరాజు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో నాగరాజు పలువురి వద్ద అప్పు చేశాడు. ఎటువంటి పని లేకుండా ఖాళీగా ఉండటంతో పాటు అప్పులు ఇచ్చిన వారి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ నెల 5న మధ్యాహ్నం 12 గంటల సమయంలో దేవి హెయిర్ ఆయిల్‌ను తాగింది. వెంటనే ఆమెను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం తెల్లవారుజాము 3 గంటలకు మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువతి అదృశ్యం


దివ్య

**సుభాష్‌నగర్:** ఓ యువతి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శివాలయనగర్‌కు చెందిన కొర్రసోనికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు, చిన్న కుమార్తెలకు వివాహమైంది. ప్రైవేట్ జాబ్ చేసే పెద్ద కుమార్తె దివ్య(26)కు వివాహం కాలేదు. సంతోష్ అనే వ్యక్తితో ఈ నెల 5వ తేదీన ఉదయం 9 గంటలకు గాంధీ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# వారానికి ఒక్కసారే నీటి సరఫరా!

అది కూడా ఏ సమయంలోనైనా అరగంటే | నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు | ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు

అసలే వేసవి కాలం ఏ మాత్రం నీళ్లు లేకున్నా పూట గడవదు. అలాంటిది వారానికి ఒక్కసారే నీళ్లు వస్తే వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. గతంలో కనీసం రెండు రోజులకు ఒకసారి అయిన నీటి సరఫరా జరిగేది. ఇప్పుడు మాత్రం వారానికి కేవలం ఒక్కసారే నీళ్లు వస్తున్నాయి. అది కూడా కేవలం అరగంట మాత్రమే. అరగంటైనా ఫలానా సమయం అంటూ లేదు. ఏ సమయంలోనైనా రావొచ్చు. నీటి కనెక్షన్లు లేని మురికివాడ ప్రాంతాల్లో అయితే నెలల తరబడి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం లేదు. నీళ్ల కోసం అధికారులకు ఎన్నిసార్లు ఫోన్లు చేసి వేడుకున్నా గుక్కెడు నీళ్లు అందడం లేదు. ఇది నిజాంపేట్ ప్రజల పరిస్థితి.



జలమండలి ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యక్తులకు విక్రయించే ట్యాంకర్లు


నీటి కొనుగోలు కోసం సిద్ధంగా ఉంచిన డ్రమ్ములు

**నిజాంపేట్:** మున్సిపల్ కార్పొరేషన్ సాయి నగర్ కాలనీలో సుమారు రెండు వేలకు పైగా జనాభా నివాసం ఉంటుంది. అందరు నిరుపేద, మధ్య తరగతికి చెందిన ప్రజలే జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీలో నీటి కోసం ప్రజలు ప్రతి నిత్యం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రెక్కాడితే కాని డొక్కాడని ప్రజలు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అదే విధంగా అంబేడ్కర్ నగర్, ఇందిరమ్మ కాలనీ పేజ్1లో సైతం ప్రజలు నీరురాక ఇబ్బందులు పడుతున్నారు.

### సమయానికి నీరు రాక..

వారానికి ఒక సారి నీళ్లు ఇస్తే తమ జీవనం ఎట్ల సాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వచ్చిన నీళ్లు కూడా తమకు సరిపడా రావడం లేదని వాపోతున్నారు. అర్ధరాత్రి సమయంలో నీళ్లు రావడంతో సరిగ్గా నిద్రలో ఉన్న సమయంలో నీళ్లు వదిలితే తాము ఎలా పట్టుకోవాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఉదయం 9 గంటలలోగా, రాత్రి 7 నుంచి 10 గంటల మధ్య నీటి సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

### వేలల్లో బిల్లులు

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నీటి సరఫరాలో ఇబ్బంది ఉండేది కాదు. మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన తరువాత నుంచి తమకు తీవ్ర నీటి ఎద్దడి ప్రారంభమైందని స్థానికులు తెలిపారు. వారానికి ఒక్క సారి వచ్చే నీటికి వేలల్లో బిల్లులు ఎలా చెల్లించాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం క్యాన్ నెంబర్‌లు ఎప్పుడు కేటాయించారనే విషయం కూడా తమకు తెలియదని, అలాంటిది ప్రస్తుతం వేలల్లో బిల్లులు పంపి చెల్లించాలని మెసేజ్‌లు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### ట్యాంకర్లతో నీటి కొనుగోలు

జలమండలి అధికారులు నీటిని సక్రమంగా ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. ఇద్దరు, ముగ్గురు నివాసాల వారు కలిసి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు.

### బిల్లులు ఎలా చెల్లించాలి



అధికారులు నీటిని సక్రమంగా సరఫరా చేయడం లేదు. సక్రమంగా నీరు సరఫరా చేసి బిల్లులు కట్టమంటే కడతాం. కానీ నీటిని ఇవ్వకుండానే వేలకు వేలు బిల్లులు చెల్లించాలంటే ఎట్లా?. తాము ఎదుర్కొంటున్న నీటి సమస్యను అధికారులు ఎందుకు పరిష్కరించరు. ఐదేళ్ల నుంచి ఇవ్వని బిల్లులు ఇప్పుడు ఏకంగా రూ.11, 397 పంపించారు.

– శ్రీనివాస్ చారి, సాయినగర్

నెల సంపాదనలో నీటి కోసం సగం ఖర్చు అవుతుందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తప్పించుకుంటున్న అధికారులు

ట్యాంకర్లతో నీటి సరఫరా చేసే బస్తీలకు మాత్రం అసలు నెలకొకసారి కూడా ట్యాకర్లను పంపడం లేదు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా తమకు సంబంధం లేదని అధికారులు సమాధానమిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఎండ కాలంలో నీళ్లు లేకపోవడంతో ఎంత ఇబ్బంది పడుతున్నామో అధికారులు ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్యాంకర్ల బాధ్యత మున్సిపల్ అధికారులది అని జలమండలి అధికారులు, మున్సిపల్ అధికారులు మాత్రం నీటి సరఫరా జలమండలి అధికారులదని అంటూ తప్పించుకుంటున్నారు. ఇరు విభాగాల మధ్య ప్రజలు నలిగిపోతున్నారు.

### ట్యాంకర్‌తోనే నీటిని కొంటున్నాం



వారానికి ఒక్కసారి కూడా నీళ్లు సరిపడా రావడం లేదు. అధికారులను అడిగి అడిగి అలసిపోయాం. తప్పని పరిస్థితిలో ట్యాంకర్ ద్వారా నీటిని కొంటున్నాం. నీళ్లు మాత్రం మేము బయట కొనుగోలు చేయాలి. జలమండలికి బిల్లులు చెల్లించాలంటే ఇప్పుడు ఎట్ల చెల్లిస్తాం. బిల్లులు పంపిన విధంగా నీళ్లు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని కాలనీల్లో, బస్తీల్లో తిరిగి తెలుసుకోవాల్సిన బాధ్యత అధికారులకు లేదా?. ఇంటింటికి తిరిగి అడిగితే తమ బాధ తెలుస్తది.

– రఘు, సాయినగర్

### మరమ్మతులు చేసే దిక్కులేదు



నీటి పైపులైన్లకు ఎక్కడైన మరమ్మతులు ఏర్పడిన, లీకేజీలు ఏర్పడిన వాటిని సకాలంలో మరమ్మతులు చేసే దిక్కు కూడా లేదు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు చెబితే జలమండలి వాళ్లకు చెప్పమంటారు. జలమండలి వాళ్లకు చెబితే మున్సిపల్ వాళ్లకు చెప్పమంటారు. అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత లేదా?. నీటిని ప్రజల అవసరానికి తగినట్లు వదలడంలో అధికారులు విఫలమవుతున్నారు.

– మురళి, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1, నిజాంపేట్

## ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి


అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సతీష్

**నిజాంపేట్ :** బాచుపల్లి వాసవి కన్‌స్ట్రక్షన్స్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సతీష్ కోరారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోమటి కుంట చెరువును పునరుద్ధరించి ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, అరుణ్‌రావు, మాధవరావు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు



**కుత్బుల్లాపూర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో నడుస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమే నేటి ఎమ్మెల్సీ ఫలితాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివాజీ రాజు, అశోక్, సరిత, మధు, మాధురి, దుర్గా, శ్రీకాంత్ రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రతినిధులు


పూజలో శఠగోప రామానుజ జీయర్ స్వామి

**కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి విశేష కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, కోశాధికారి రామాచారి పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముఖ్య అతిథిగా శఠగోప రామానుజ జీయర్ స్వామి హాజరయ్యారు. ఉదయం 6 గంటల నుంచి విశేషాలంకరణ పూర్తి చేసి ప్రవచనం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గుర్రాల వాహన సేవ కాలనీ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బంగారు, వెండి ఆభరణాలు చోరీ

### ఇంటి వ్యక్తిని తోసేసి మహిళ పరార్

**జగద్గిరిగుట్ట :** ఓ మహిళ ఓ ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పరారైంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. జటకన్య హోటల్, ఆల్విన్ కాలనీలో నివాసం ఉండే శ్రీకాంత్ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. రోజులాగే విధులకు వెళ్లాడు. అతని తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నారు. శ్రీకాంత్ తండ్రి పక్కనున్న ఇంటి వాళ్లతో మాట్లాడుతుండగా ఇంట్లో నుంచి శబ్దం వినిపించింది. ఓ మహిళ బయటకు రావడం చూశాడు. ఎవరూ అని ప్రశ్నించే లోపే అతడిని తోసేసి పరారైంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. బీరువాలో ఉన్న 6 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ కంటే ముందు ఆ మహిళ సమీపంలోని ఓ ఫొటో స్టూడియోలో కెమెరాను కూడా చోరీ చేసేందుకు యత్నించినట్లు తెలిసింది. ఇదే స్టూడియోలో ఫొటో దిగి తనకు ఇష్టం లేదని ఫొటోను డిలీట్ చేపించింది. ఆ మహిళకు మరొకరు సహకారం కూడా చేసినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించింది.

## కైసర్‌నగర్‌లో ట్యాంక్ ఫిల్లింగ్ పాయింట్


ఫిల్లింగ్ పాయింట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీజీఎం నారాయణ, జీఎం అశోక్, అధికారులు

**చింతల్:** త్వరితగతిన పనులు పూర్తి చేసి ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌ను అందుబాటులోకి తేవాలని వాటర్ వర్క్స్ సర్కిల్ ఫోర్ సీజీఎం నారాయణ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ పరిధిలో కైసర్‌నగర్ రిజర్వాయర్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. ఫిల్లింగ్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. వేసవిలో ట్యాంకర్ల బుకింగ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే షాపూర్ నగర్‌లో ఒక ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చారు. గాజులరామారం, కైసర్ నగర్ తదితర ప్రాంతాలకు షాపూర్ నగర్ నుంచి, జీడిమెట్ల రిజర్వాయర్ల నుంచి ట్యాంకర్లను పంపుతుండటంతో అధిక సమయం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఒక్కో ట్యాంకర్ సుమారు నాలుగు నుంచి ఆరు ట్రిప్పుల వరకే పరిమితమవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జలమండలి ఉన్నతాధికారులు గాజులరామారం, కైసర్ నగర్ పరిసర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు కైసర్‌నగర్ రిజర్వాయర్ వద్ద నూతనంగా మరో ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తక్షణ మరమ్మతుల కింద నూతన ఫిల్లింగ్ పాయింట్‌ను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గాజులరామారం సెక్షన్ మేనేజర్ రోహిణి, షాపూర్‌నగర్ సెక్షన్ మేనేజర్ రమ్య పాల్గొన్నారు.

## అనుమతిలేని భవనం సీజ్


భవనాన్ని సీజ్ చేసిన అధికారులు

**సుభాష్‌నగర్:** అనుమతికి మించి నిర్మాణాలు చేపట్టిన ఓ భవనాన్ని అధికారులు గురువారం సీజ్ చేశారు. సూరారం డివిజన్ సిద్ధివినాయక నగర్‌లో ఓ భవన యజమాని జీ ప్లస్ టు అనుమతి తీసుకొని నిబంధనలు పాటించకుండా అదనంగా రెండు అంతస్తులు నిర్మించారు. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జాసింగ్ నేతృత్వంలో సూరారం పోలీసులు భద్రత మధ్య రెండు అంతస్తులను కూల్చివేశారు. కూలుస్తున్న సమయంలో భవన యజమాని సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ అధికారులు కూల్చివేశారు. అనంతరం సదరు భవనాన్ని సీజ్ చేశారు.

**చుట్టుపక్కల పదుల సంఖ్యలో..**

సిద్ధివినాయక నగర్‌లో కూల్చివేసిన భవనాన్ని ఆనుకొని పదుల సంఖ్యలలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయి. వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న పాపనా పోలేదు. గతంలో నోటీసులతో సరిపెట్టి వాటిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## మల్లారెడ్డి ఆస్పత్రిలో రోబోటిక్ చికిత్సలు


ఐ మంత్ర 3.0 రోబోటిక్ ఆవిష్కరణలో డాక్టర్ భద్రారెడ్డి, ప్రీతి రెడ్డి, కల్పనారెడ్డి

**సుభాష్‌నగర్:** మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి రాష్ట్రంలోని మొట్టమొదటి శస్త్రచికిత్స రోబోటిక్ వ్యవస్థ ఐ మంత్ర 3.0 ను విజయవంతంగా ప్రవేశపెట్టిందని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠం చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి అన్నారు. సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో రోబోటిక్ ఐ మంత్ర 3.0 ను మల్లారెడ్డి విశ్వవిద్యాలయ చాన్సలర్ కల్పనారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి రెడ్డిలతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని పెంచి, చికిత్స సమయంలో వచ్చే సంక్లిష్టతలను తగ్గిస్తుందన్నారు. ఇది తెలంగాణను రోబోటిక్ శస్త్ర చికిత్స రంగంలో ప్రముఖ స్థానంలో నిలబెట్టేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు.

## సీతారాముల కల్యాణం.. గోటి తలంబ్రాల్లో భాగస్వాములవండి

**ఆల్విన్‌కాలనీ:** భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణార్థం పంపే గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులు భాగస్వాములవ్వాలని కూకట్‌పల్లి ధర్మజాగరణ సమితి పిలుపునిచ్చింది. గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులకు అవకాశం కల్పించారు. ఈ దైవ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు ఇంటి నుంచి ఒక ప్లేట్ తీసుకుని సుమిత్ర నగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయానికి 7వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాలన్నారు. వారికి వడ్ల గింజలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని సమితి నిర్వాహకులు నామాల శ్రీనివాస్ నేత, భోములే శంకర్‌లు కోరారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం




**మూసాపేట:** వేసవి కాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం మూసాపేటలోని చిత్తారమ్మ తల్లి ఆలయం వద్ద ఉప్పల చారిటబుల్ ట్రస్టు, మూసాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగడాల శిరీష బాబూరావు, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, నాయకులు గౌసుద్దీన్, అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, పంచశీల శ్రీనివాస్, సంఘం సభ్యులు చంద్రశేఖర్ ఉన్నారు.

## మంటలు చెలరేగి ద్విచక్ర వాహనం దగ్ధం


పూర్తిగా దగ్ధమైన ద్విచక్ర వాహనం

**జగద్గిరిగుట్ట:** ద్విచక్ర వాహనం దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం రాత్రి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేంకటేశ్వర నగర్‌లో బుధవారం రాత్రి హీరో గ్లామర్ ద్విచక్ర వాహనంలో మంటలు వచ్చాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఆ వాహనం ఎవరిది, మంటలు ఎలా చెలరేగాయి అన్న విషయాలపై సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు సీఐ నర్సింహ తెలిపారు. బైకు దగ్ధమవుతున్న సమయంలో ఓ వ్యక్తి అక్కడి నుంచి పరిగెత్తినట్లు పోలీసులకు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**చింతల్:** చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలో వేంకటేశ్వర స్వామి 49వ కల్యాణ మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. హెచ్ఎంటీ హిందూ దేవాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్ఎంటీ జనరల్ మేనేజర్ ఎస్ఐ రాజబాబు, శ్రీదేవి దంపతులు, ఆలయ అధ్యక్షుడు మానేపి ప్రకాష్, అంజలి సిన్హాల ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 4.30 గంటలకు వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, 6.30 గంటలకు మంగళ హారతి మంత్రపుష్పం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాదం, సాయంత్రం 6:30 గంటలకు పుర వీధులలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పున్న శ్రీశైలం, ట్రెజరర్లు వెంకట ప్రసాద్, వికాస్ కుమార్, ఉపాధ్యక్షులు లేపాక్షి గౌడ్, దానప్ప, ఉప ప్రధాన కార్యదర్శి రవిశంకర్, సంయుక్త ప్రధాన కార్యదర్శులు మధు, శ్రీనివాసులు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



**నిజాంపేట్ :** బాచుపల్లిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. గురువారం ఉదయం ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ గేట్ ముందు గల షుగర్ కేన్ దుకాణం పైకి ఓవర్ స్పీడ్‌తో కారు దూసుకొచ్చింది. దుకాణం ధ్వంసం కావడంతో పాటు ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఆ కారులో ఎంఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్టూడెంట్ అధిక స్పీడ్ రాష్ డ్రైవింగ్‌తో వచ్చి బలంగా ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గురైన కారుపై మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి అసెంబ్లీ పాస్ ఉంది.